# సాక్షి
## పశ్చిమగోదావరి

సోమవారం । 16 । అక్టోబర్ । 2023






### 'ఆడుదాం ఆంధ్ర'కు సిద్ధం

'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ప్రభుత్వం డిసెంబర్ 11 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటల పోటీలు నిర్వహించనుంది. ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 8లో ▸



### ఆక్వా రంగ పటిష్టానికి కృషి

ఆక్వా రంగ పటిష్టానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వానుబాబు అన్నారు. జిల్లా ఆక్వా రైతుల సదస్సులో మాట్లాడారు. 8లో ▸




### పొక్లెయిన్‌కి నిప్పు

నూజివీడు మండలంలోని గొల్లపల్లి రఘునాథస్వామి ఆలయ భూముల్లో ఉన్న పొక్లెయిన్‌ను గుర్తు తెలియని దుండగులు తగులబెట్టారు. 8లో ▸

## న్యూస్‌రీల్

### బలుసులమ్మ ఆశీస్సులు ఉండాలని..

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



బలుసులమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రానికి సీఎం జగన్ నాయకత్వం అవసరమని, ఈ మేరకు బలుసులమ్మ వారి ఆశీస్సులు కోరుకున్నామని, డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణ ఇలవేల్పు బలుసులమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలను ఆదిరం ఆయన ప్రారంభించారు. ముందుగా మంత్రి కొట్టు దంపతులు ప్రత్యేక పూజలు జరిపించి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని, జగన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించామన్నారు. అమ్మవారి కరుణతో సకాలంలో వర్షాలు పడి, పంటలు బాగా పండి రైతులు, పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి చెందాలని కోరామన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం విశేషమైన అభివృద్ధి దిశగా ముందుకెళుతుందని, భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు ఏర్పాటు చేశామన్నారు. అమ్మవారి ప్రతిమ, పసుపు, కుంకుమలను ఆలయ కమిటీ అందిస్తుందన్నారు. అమ్మవారికి వెండి తొడుగు సంకల్పిస్తే భక్తులు విశేషంగా సహకరించారని, ప్రధాన ద్వారం వెండితో తయారు చేయిస్తామన్నారు. అనంతరం ఆయన అమ్మవారి రథం, కొత్తగా నిర్మిస్తున్న కోనేరు, ఆలయ అభివృద్ధి పనులు పరిశీలించారు. దేవదాయ డీసీ విజయరాజు, ఏసీ సుబ్బారావు, ఈఓ ఎ.రవిశంకర్, యువనేత కొట్టు విశాల్, ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు రామాంజనేయులు, సీజీఎఫ్ కమిటీ సభ్యుడు కర్రి భాస్కరరావు ఉన్నారు.

### మున్సిపల్ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక



రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

సాక్షి, భీమవరం: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన ఎస్.కృష్ణమోహనరావు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమవరంలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.నాయుడుబాబు (విశాఖ), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్ఎఫ్ అహ్మద్ (సాలూరు), అడిషనల్ సెక్రటరీగా ఎ.ఆంజనేయులు (ఎమ్మిగనూరు) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వైఎస్‌సీహెచ్ పెద్దిరాజు (సాలూరు), కె.శివాజీ (తుని), షేక్ కాజుద్దీన్ (గిద్దలూరు), వైవీ మోహన్ రంగ (తుని), కె.చెంచయ్య (అద్దంకి), మహిళా కార్యదర్శిగా జి.నీలిమ (యలమంచిలి), వై.కోటేశ్వరమ్మ (చీరాల), పి.అబ్దుల్లా బేగం (నంద్యాల), కోశాధికారిగా ఎస్.వెంకటేష్ (మచిలీపట్నం), పబ్లిసిటీ సెక్రటరీగా ఎ.శ్రీనివాసరావు (భీమవరం), జాయింట్ సెక్రటరీలుగా జె.గోవిందయ్య (యలమంచిలి), ఎస్వీ రమణ (తణుకు), ఎం.మాల్యాద్రి (కావలి), వి.గిరిధర్‌బాబు (మదనపల్లి), సాంస్కృతిక విభాగం కార్యదర్శి వి.నాగేశ్వరరావు (పెడన), లీగల్ అడ్వైజర్‌గా కె.సాయిరాం (కొవ్వూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మున్సిపల్ కమిషనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం తప్పదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ల సంఘం కార్యదర్శి ఎస్.షబ్బీర్ అలీ, కోశాధికారి శ్రీధర్, రాష్ట్ర మున్సిపల్ కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు నెక్కంటి సుబ్బారావు, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గోగురాజు పాల్గొన్నారు.

### మచిలీపట్నంకు ప్రత్యేక బస్సులు

నరసాపురం: పాలకొల్లు–మచిలీపట్నం మధ్య 10 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.సుబ్బన్నరెడ్డి తెలిపారు. సోమవారం నుంచి ఉదయం 5.30 గంటలు నుంచి సాయంత్రం 6.30 గంటలు వరకూ ప్రతి 45 నిమిషాలకు ఒక బస్సు నడిచేలా చర్యలు చేపట్టామన్నారు. పాలకొల్లు–నరసాపురం–మొగల్తూరు మీదుగా బస్సులు తిరుగుతాయని, నరసాపురం డిపో నుంచి 5 బస్సులు, మచిలీపట్నం డిపో నుంచి 5 బస్సులు ఏర్పాటుచేశామన్నారు.

## సిరుల తల్లి.. కల్పవల్లి

భక్తులపాలిట కొంగు బంగారం..

కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పులు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. గ్రామదేవతల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

-సాక్షి, నెట్‌వర్క్



భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మవారు



తణుకు కల్చరల్: దువ్వ దానేశ్వరి అమ్మవారు



పెనుగొండ: వాసవీమాత



నూజివీడు: కోట మహిషాసురమర్దినీదేవి



కైకలూరు: కొల్లేటి పెద్దింట్లమ్మవారు



ద్వారకాతిరుమల: కుంకుళ్లమ్మవారు

# సువర్ణావకాశం ఓపెన్

- చదువులకు మార్గం.. సార్వత్రిక విద్యాపీఠం
- ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ ప్రవేశాలు
- ప్రారంభమైన తరగతులు
- నెలాఖరు వరకు ప్రవేశాలకు అవకాశం



ఆకివీడులో ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరైన అభ్యాసకులు

పెనుగొండ: వివిధ కారణాల వల్ల చదువు మానేసిన వారు పదో తరగతి, ఇంటర్ పూర్తిచేసేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా ప్రభుత్వం సువర్ణావకాశం కల్పిస్తోంది. ఈ సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు ఉంది. వీరు ఎలాంటి ఉద్యోగానికైనా అర్హులే. చదువుపై ఆసక్తి ఉన్న పలువురు ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ పూర్తిచేసి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అభ్యాసకులకు విద్యను మరింత చేరువ చేసేలా ప్రభుత్వం ఓపెన్ స్కూల్ తరగతులు నిర్వహిస్తోంది. నెలాఖరు వరకు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశాలు పొందిన వారికి తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. ఆకివీడులో ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయి.

**టెన్త్‌కు 25.. ఇంటర్‌కు 51 కేంద్రాలు**

జిల్లాలో పదో తరగతికి 25, ఇంటర్‌కు 51 ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటివరకు టెన్త్‌కు 253 మంది దరఖాస్తు చేసుకోగా 166 మందిని అర్హులుగా నిర్ణయించారు. అలాగే ఇంటర్‌లో సైన్స్ విభాగంలో 311 మంది దరఖాస్తు చేసుకోగా 122 మందిని, ఆర్ట్స్ విభాగంలో 303 మంది దరఖాస్తు చేసుకుంటే 153 మందిని అర్హులుగా నిర్ణయించారు. ప్రవేశాలకు ప్రభుత్వం మరింత సమయం ఇవ్వడంతో పాటు ఈ ఏడాది స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. **ఇంటర్‌లో..** పదో తరగతితో పాటు ఇంటర్‌లో ఆర్ట్స్ గ్రూపులైన హెచ్ఈసీ, సీఈసీలు, సైన్స్ గ్రూపులైన ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీలో ప్రవేశాలు పొందవచ్చు. ఈ సర్టిఫికెట్లు ఉన్నత చదువులకు, ఉద్యోగాలు, పదోన్నతులకు ఉపయోగపడుతున్నాయి. అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా లేదా జనన ధ్రువీకరణ పత్రం, టీసీ, ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్ బుక్, ఫొటో, సంతకంతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.



పెనుగొండలో ఓపెన్ స్కూల్ సెంటర్

### దరఖాస్తుల గడువు పెంపు

“ చదువుకోవాలనుకునే వారికి ఓపెన్ స్కూల్ సువర్ణావకాశం. ఇప్పటికే పలువురు దరఖాస్తు చేసుకోగా.. మరింత మందికి అవకాశమిచ్చేలా ప్రభుత్వం గడువు పెంచింది. ఈ సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంది. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– తిరుపతి రాజు, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్

### లక్ష మంది లక్ష్యంగా..



ఆకివీడు: బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఓపెన్ స్కూల్ ద్వారా ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి చదువుకునే అవకాశం కల్పించిందని ఓపెన్ స్కూల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ జి.శివ కోటేశ్వరరావు అన్నారు. ఆకివీడు విద్యా వికాస్‌లో జరుగుతున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 60 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, మొత్తంగా 1,500 అధ్యయన కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాల్లో 30 సెలవు దినాల్లో తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రాక్టికల్స్ కూడా జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి ఫీజు రూ.2 వేలు వసూలు చేస్తారని, పరీక్షలు రాసిన అనంతరం తిరిగి వారి ఖాతాల్లో ఆ సొమ్మును ప్రభుత్వ జమ చేస్తుందని చెప్పారు. ప్రవేశాలు పొందిన వారికి పుస్తకాలు, వర్కుబుక్కులు వంటివి పోస్టు ద్వారా నేరుగా ఇంటికే వస్తాయన్నారు. 18 ఏళ్లు నిండిన వారు పదో తరగతి ప్రవేశాలు పొందవచ్చని, అలాగే వన్ సిట్టింగ్‌లో ఇంటర్ చదువుకునే అవకాశం ఉందని రాష్ట్ర కో–ఆర్డినేటర్ శివ కోటేశ్వరరావు తెలిపారు.

### వైఎస్సార్ సీపీ బస్సు యాత్రకు మద్దతు

సాక్షి, భీమవరం: ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వైఎస్సార్ సీపీ బస్సు యాత్రకు మాల సంఘాల మద్దతు ఉంటుందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు తెలిపారు. భీమవరంలో ఆదివారం నిర్వహించిన మాలమహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి పాల్పడిన చంద్రబాబుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యువత అభివృద్ధి కోసం సీఎం జగన్ పలు కార్యక్రమాలు చేపట్టారన్నారు. కొందరు సీఎం జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని, రాష్ట్ర ప్రజల మద్దతు ఆయనకే ఉందన్నారు. ఎ.ఆనంద్, ఎం.యేసేబు, బి.సునీల్‌బాబు, బి.సందీప్ పాల్గొన్నారు.

### యథావిధిగా గుంటూరు ఫాస్ట్ పాసింజర్

నరసాపురం: నరసాపురం నుంచి గుంటూరు వెళ్లే గుంటూరు ఫాస్ట్ పాసింజర్ రైలు సోమవారం నుంచి యథావిధిగా నడుస్తుందని నరసాపురం స్టేషన్ మాస్టర్ దివాకర్ తెలిపారు. రోజూ ఈ రైలు నరసాపురంలో ఉదయం 6 గంటలకు బయలుదేరి ఉదయం 11.30 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. ట్రాక్ మరమ్మతుల కారణంగా గత జూన్‌లో కొద్దిరోజులు రద్దు చేశారు. మళ్లీ నెలరోజుల క్రితం పునః ప్రారంభించినా విజయవాడ వరకు మాత్రమే నడుపుతున్నారు. గుంటూరు వరకూ నడపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేయడంతో రైల్వే శాఖ సర్వీస్‌ను పునరుద్ధరించింది.



ఏలూరులో కేంద్రం వద్ద పరిశీలిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీలు మేరీ ప్రశాంతి, శ్రీధర్



అభ్యర్థులను మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు చేసి కేంద్రాల్లోకి పంపుతున్న పోలీస్ సిబ్బంది

# ముగిసిన ఎస్సై పరీక్షలు

### ఏలూరులోని 5 కేంద్రాల్లో నిర్వహణ

ఏలూరు టౌన్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్సై మెయిన్స్ రాత పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఏలూరులోని ఐదు కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు నడుమ రెండు రోజులపాటు పరీక్షలు నిర్వహించారు. అభ్యర్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనలో పోలీసు శాఖ సక్సెస్ అయ్యింది. ఉదయం 8 గంటలకే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకున్నారు. ప్రతి అభ్యర్థినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అధికారులు కేంద్రాల్లోకి అనుమతించారు. మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేశారు. పరీక్షలకు 4,162 మందికి అభ్యర్థులు 55 మంది గైర్హాజరయ్యారు.

**కట్టుదిట్టమైన బందోబస్తు**

ఏలూరులో ఎస్సై మెయిన్స్ పరీక్షలకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. పరీక్షా కేంద్రాలకు వెళ్లే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. అభ్యర్థులు ఉదయం పరీక్ష పూర్తిచేసిన అనంతరం రెండో పరీక్షకు వ్యవధి తక్కువగా ఉండటంతో పరీక్షా కేంద్రాల వద్దే ఆహార పదార్థాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు.

**ఇన్‌చార్జులుగా ముగ్గురు ఎస్పీలు**

ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్వయంగా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఏలూరు, కృష్ణా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ఎస్పీలు డి.మేరీ ప్రశాంతి, జాషువా, శ్రీధర్ ఇన్‌చార్జులుగా వ్యవహరించారు. ఏలూరు అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఎస్బీ సీఐ ఎం.సుబ్బారావు, డీటీసీ డీఎస్పీ కె.ప్రభాకరరావు, డీఎస్పీ గోగుల వెంకటేశ్వరరావు, ఏలూరు టౌన్ సీఐలు ఎన్.రాజశేఖర్, పి.చంద్రశేఖర్, కోమాకుల శివాజీ, సీసీఎస్ సీఐ మురళీకృష్ణ, ట్రాఫిక్ సీఐ కేవీఎస్ వరప్రసాద్, బి.ఆదిప్రసాద్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**సమర్థవంతంగా పరీక్షల నిర్వహణ: డీఐజీ**

రేంజ్ పరిధిలో ఎస్సై పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఏలూరులోని ఐదు కేంద్రాల్లో రెండోరోజు 4,107 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్ వాచీలు వంటివి అనుమతించలేదన్నారు. పోలీస్ అధికార యంత్రాంగం సమష్టి కృషితో పరీక్షలు విజయవంతంగా జరిగాయని డీఐజీ అన్నారు.

# కులగణన.. కార్యాచరణ

- కులాల వారీగా జనగణనకు ప్రభుత్వం చర్యలు
- ప్రత్యేక యాప్ ద్వారా వలంటీర్ల ద్వారా సర్వే
- ఏళ్ల తరబడి డిమాండ్‌కు పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాలు



కులగణనపై హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో కులాల వారీగా జనగణన నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల అసెంబ్లీలో కులగణన చేసేందుకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దీనిని కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. వచ్చేనెల 15 తర్వాత రాష్ట్రంలో కులాల వారీగా జనగణనకు సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు సర్వే చేపట్టనున్నారు. దీని కోసం ప్రత్యేక యాప్ రూపొందించనున్నారు. ఒక్కో వలంటీర్‌కు 100 ఇళ్లను కేటాయించడం ద్వారా పూర్తి వివరాలను సేకరిస్తారు. దీనిపై బీసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో చాలాకాలంగా కులగణన డిమాండ్ ఉంది. ఈ క్రమంలో సీఎం జగన్ సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకున్నారని బీసీ సంఘాల నాయకులు అంటున్నారు. సీఎం జగన్ బీసీ పక్షపాతి అని మరోమారు నిరూపించుకున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**పక్కా లెక్కలతో..**

కులాల వారీగా సమగ్ర లెక్కలు లేకపోవడంతో అధికారంలోకి వచ్చిన పాలకులు వారికి ఇష్టమొచ్చిన రీతిలో గణాంకాలు చెబుతూ వస్తున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇటువంటి పరిస్థితి ఉండదని బీసీ సంఘాల నాయకులు, మేధావులు అభిప్రాయపడుతున్నారు. కులగణన ద్వారా ప్రతి కుటుంబ వివరాలు పొందుపర్చనున్నారు. ఏయే కులాలకు సంబంధించి ఎంత మంది ఉన్నారు, స్త్రీ, పురుషుల లెక్కలు, వారి స్థితిగతులు తెలియనున్నాయి. ప్రభుత్వం నుంచి ఏయే సామాజిక వర్గానికి రావాల్సిన వాటా ఎంత, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అందాల్సిన వాటా ఎంతనే దానిపై స్పష్టత రానుంది.

### ఏళ్ల నాటి బీసీల కల



రాష్ట్రంలో వచ్చేనెల 15 తర్వాత సమగ్ర కులగణన చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయం. దీంతో ఏళ్ల నాటి కల సాకారం కానుంది. బీసీల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ బాసటగా నిలుస్తున్నారు. ఇప్పటికే నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థలు, అసెంబ్లీ, రాజ్యసభ సీట్ల కేటాయింపులో బీసీలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. తాజాగా బీసీల కులగణన చేపట్టనుండటం హర్షణీయం.

– లక్కోజు రాజగోపాలాచారి, అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్, ఏలూరు

### అభినందనీయం



బీసీల కులగణనపై కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభల్లో తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించాలి. కేంద్ర ప్రభుత్వం బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోంది. బ్రిటిష్ హయాంలో 1931లో దేశంలో సమగ్ర కులగణన జరిగింది. దాదాపు తొమ్మిది దశాబ్దాలు దాటినా కేంద్రం సమగ్ర కులగణన నిర్వహించేందుకు ముందుకు రాకపోవడం శోచనీయం. కేంద్రానికి భిన్నంగా రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టడం అభినందనీయం.

– అన్నపురెడ్డి మురళి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దొమ్మర సంస్కార సంఘం

### ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మహిళా బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉభయ సభల్లో ప్రవేశపెట్టి ఆమోదించడం అభినందనీయం. ఇదే సమయంలో దేశంలో సగానికి పైగా ఉన్న బీసీలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. మహిళా బిల్లులో ఓబీసీ మహిళల కోటాను తేల్చాలి. అప్పుడే ఈ దేశంలోని బీసీలకు న్యాయం జరుగుతుంది. రాష్ట్రంలో బీసీ కులగణనపై సానుకూలంగా స్పందించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– ఆరేపల్లి వెంకట సత్యనారాయణ, గౌడ సంఘం నాయకుడు

### బీసీల సాధికారతకు..



గత పాలకులు బీసీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేశారు. ఎన్నికల సమయంలో వాడుకుని వదిలేసేవారు. దానికి భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో బీసీలకు అన్నింటా పెద్దపీట వేస్తోంది. బీసీల సాధికారతకు చిత్తశుద్ధితో పనిచేస్తోంది. తాజాగా రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించడం శుభపరిణామం.

– పరిటాల వీరాస్వామి, అధ్యక్షుడు, ఏలూరు పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం

## క్లుప్తంగా

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతుడు శ్రీనివాసరావు(ఫైల్)

చాట్రాయి : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఆరుగొలనుపేటలో జరిగింది. గ్రామానికి చెందిన తిరువీధి శ్రీనివాసరావు(45) భార్య తిరువీధి సరిత మనస్పర్థలతో పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపంతో శ్రీనివాసరావు శనివారం పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం అతను మృతి చెందాడు.

### తల్లి, చెల్లిపై కత్తిపీటతో దాడి


దాడిలో గాయపడిన చెల్లి రత్నకుమారి

బుట్టాయగూడెం: మందలించిన తల్లి, చెల్లిపై కత్తితో దాడి చేసిన సంఘటన జీలుగుమిల్లి మండలం తాటాకుల గూడెంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కవులూరు వంశీకృష్ణను తల్లి బేబి, చెల్లి రత్నకుమారిలు చెడుమార్గంలో వెళ్తున్నాడని మందలించినందుకు కోపంతో ఆదివారం తెల్లవారుజామున కత్తిపీటతో దాడి చేశాడు. దాడిలో ఇద్దరూ తీవ్రంగా గాయపడడంతో ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు.

# 'ఆడుదాం ఆంధ్ర'కు సిద్ధం

- డిసెంబర్ 11 నుంచి జనవరి 7 వరకు ఆటల పోటీలు
- ఆటస్థలాల అభివృద్ధికి రూ. 21.72 లక్షలు


క్రికెట్ కిట్లు

ఏలూరు రూరల్ : త్వరలో క్రీడా సంబరాలు ప్రారంభం కానున్నాయి. 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ప్రభుత్వం డిసెంబర్ 11 నుంచి జనవరి 15 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ఆటల పోటీలు చేపట్టనుంది. 34 రోజులు క్రీడాభిమానులకు కనువిందు కానుంది. ఏలూరు జిల్లాలో డిసెంబర్ 11న సచివాలయ స్థాయిలో పోటీలు ప్రారంభమై జనవరి 7న జిల్లా స్థాయిలో ముగుస్తాయి. కబడీ, ఖోఖో గ్రామీణ క్రీడలతో పాటు క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్ తదితర అంశాల్లో 68,970 మంది క్రీడాకారులు తలపడనున్నారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వం రూ.37.22 లక్షలు ఖర్చు చేయనుంది.

**497 ఆటస్థలాల అభివృద్ధి**

గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం చేపట్టింది. ఇందుకోసం గ్రామాలు, నగరాల్లో మొత్తంగా 497 ఆటస్థలాలు గుర్తించింది. వీటిని అభివృద్ధి చేసేందుకు రూ 21.72 లక్షలతో ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళిక రూపొందించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. ఇప్పటికే క్రీడా పరికరాలు జిల్లాకు చేరాయి.

**పెద్ద సంఖ్యలో క్రీడాకారులు**

15 ఏళ్ల పైబడిన బాలబాలికల నుంచి 30 ఏళ్ల వరకూ ఈ పోటీల్లో పాల్గొంటారు. మొత్తంగా 605 సచివాలయాల జట్లు పాల్గొంటాయి. ఇందులో అర్బన్‌లో 110, గ్రామాల్లో 495 ఉన్నాయి. ఒక్కొక్క సచివాలయం నుంచి 114 మంది చొప్పున మొత్తం 68,970 మంది క్రీడాకారులు భాగస్వాములవుతారు. పోటీలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు 6,050 మందితో టీం సిద్ధం చేశారు. ఇందులో 257 పీఈటీ, 60 మంది సీనియర్ క్రీడాకారులతో పాటు మండల పరిషత్, రెవెన్యూ, విద్య, ఆరోగ్యశాఖల జిల్లా మండల, సచివాలయ స్థాయి అధికారులు ఉన్నారు.

**నగదు బహుమతులు ఇలా**

పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందించి మరింతగా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నియోజకవర్గ స్థాయిలో బాడ్మింటన్ పోటీల విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, జిల్లా స్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు, రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు, తృతీయ బహుమతిగా రూ.30 వేలు అందిస్తారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, క్రికెట్ పోటీల్లో విజేతలకు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, జిల్లా స్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ. 20 వేలు, రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.5 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.3 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.2 లక్షలు అందచేస్తారు.

### ఇప్పటికే క్రీడా పరికరాల రాక



ఆడుదాం ఆంధ్ర పోటీల కోసం ప్రభుత్వం క్రీడా సామగ్రి అందజేసింది. కబడీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్‌లో నియోజకవర్గం, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు, షీల్డ్స్‌తో పాటు నగదు బహుమతి అందజేస్తాం. ఐదు క్రీడాంశాలలోనే కాకుండా సచివాలయ, మండల స్థాయిలో ఆసక్తి గలవారికి టెన్నికాయిట్, లెమెన్‌స్పూన్, మ్యూజికల్ చైర్ లాంటి గేమ్స్ ఆడిస్తాం. వీలైతే దాతల సహకారంతో వీరికి బహుమతులు అందజేస్తాం.

– బి.శ్రీనివాసరావు, జిల్లా చీఫ్ కోచ్

### అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


మృతుడు పేరం ఏసుబాబు(40)

భీమడోలు: అప్పుల భారం తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన భీమడోలు పంచాయతీ శివారు ఆర్జావారిగూడెంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. ఆర్జావారిగూడెంకు చెందిన పేరం ఏసుబాబు భీమడోలులో వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నాడు. నష్టాలు రావడంతో సుమారు రూ.16 లక్షల మేర అప్పులు పాలయ్యాడు. ఇంటిపై కూడా అప్పు తీసుకుని గత మూడు నెలలుగా వాయిదాలు చెల్లించడం లేదు. దీంతో ఇల్లు వేలం వేస్తామని నోటీస్ పంపారు. ఇప్పటికే పలువురు దగ్గర తీసుకున్న వ్యక్తిగత అప్పులు కూడా తీర్చలేక పోవడంతో అప్పిచ్చిన వ్యక్తులు లాయర్ ద్వారా నోటీసులు పంపారు. దాంతో మనస్తాపానికి గురైన ఏసుబాబు తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకుని మృతి చెందాడు. తెల్లారినా భర్త బయటకు రాకపోవడంతో భార్యకు అనుమానం వచ్చి తలుపు తట్టింది. ఇరుగుపొరుగు వారి సహకారంతో బలవంతంగా తలుపు తెరిచి చూడగా శవమై వేలాడుతూ కనిపించాడు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## 19న పండ్ల రైతుల రాష్ట్ర సదస్సు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 19న అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరుగుతున్న పండ్ల తోటల రైతుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 30 లక్షల ఎకరాల్లో మామిడి, అరటి, బత్తాయి, నిమ్మ, బొప్పాయి, జామ, సపోటా, డ్రాగన్, ఖర్జూర, కర్బూజా, దానిమ్మ, పుచ్చ వంటి అనేక రకాల పండ్ల తోటలు సాగు చేస్తున్నారన్నారు. చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా అంతు చిక్కని వైరస్‌లతో పండ్ల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. పండ్ల తోటల రైతులకు పంట బీమా పథకం అమలు చేయాలని కోరారు. ఏలూరు జిల్లా పరిధిలో మామిడి, నిమ్మ పంటలను వేలాది ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారన్నారు. పండ్ల తోటల రైతులకు కనీస మద్దతు ధరలు ప్రకటించి అమలు చేయాలని కోరారు.

## వాస్తవాలకు ప్రతిరూపం 'యూనివర్సిటీ'


తణుకులో యూనివర్సిటీ సినిమా చూసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి నటించిన యూనివర్సిటీ సినిమా కొన్ని రాష్ట్రాలతోపాటు, గత ప్రభుత్వ హయాంలో జరిగిన వాస్తవాలు అద్దం పట్టేలా ఉందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. నారాయణ మూర్తి నటించిన యూనివర్సిటీ సినిమా ప్రారంభోత్సవ షోను తణుకు వెంకటేశ్వర థియేటర్‌లో ఆదివారం మంత్రి కారుమూరి స్వయంగా వీక్షించారు. ఈ సందర్భంగా సినిమా చూసిన అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను యూనివర్సిటీ సినిమాలో కళ్లకు కట్టినట్లుగా చూపించారని అన్నారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి పేరుతో గత ప్రభుత్వం మోసం చేసిన వైనం, తెలుగుతోపాటు ఇంగ్లీషు విద్యకు ఉన్న ప్రాధాన్యతను కూడా ఈ సినిమాలో స్పష్టంగా చూపించారని అన్నారు. ఈ సమస్యలను ముందుగానే గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియాన్ని ప్రవేశపెట్టారని, విద్యార్థులకు ట్యాబ్‌లు అందచేసి డిజిటల్ విద్యావిధానాన్ని అందుబాటులోకి తేవడంతోపాటు బైజూస్‌తో ఒప్పందం చేసుకుని విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా పాఠ్యాంశాల ద్వారా పట్టు సాధించేలా వారిని సిద్ధం చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా రెండున్నర లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించడమే కాకుండా డీఎస్సీ, గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలను సైతం నిర్వహించి అర్హులందరికీ ఉద్యోగాలు వచ్చేలా చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఉదయం షో టికెట్లన్నీ మంత్రి కారుమూరి కొనుగోలు చేసి అందరినీ సినిమాకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, థియేటర్ అధినేత ఆకుల బాబు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఎస్సీ సెల్ తణుకు మండల అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, ములగాల శ్రీనివాస్, కుడుపూడి చంద్రరావు, తాటిపర్తి వాసు, తానేటి వీరయ్య, ఝాన్సీ లారెన్స్, సామంతుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## పొక్లెయిన్‌ని తగులబెట్టిన దుండగులు

రూ.40 లక్షల ఆస్తినష్టం


కాలిపోయిన పొక్లెయిన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి రఘునాథస్వామి ఆలయ భూముల్లో ఉన్న విలువైన పొక్లెయిన్‌ను గుర్తు తెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి తగులబెట్టారు. ఈ సంఘటన మండలంలో తీవ్ర సంచలనం కలిగించింది. ఈ పొక్లెయిన్ మండలంలోని తుక్కులూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఉప సర్పంచి అచ్చి కాసులు లీజుకు తీసుకుని నడుపుకుంటున్నారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి ఆలయానికి సంబంధించిన భూమిని దేవరగుంటకు చెందిన కొమ్ము తిరుపతిరావు 2008 నుంచి సాగు చేసుకుంటున్నాడు. ఆ భూమిని చదును చేసే నిమిత్తం వారం రోజుల క్రితం అతనికి పొక్లెయిన్ పంపారు. డ్రైవర్ జే భరత్‌కుమార్ ఈనెల 14న సాయంత్రం తోటలో ఉంచిన మిషన్‌ను చూసి వచ్చారు. ఆదివారం ఉదయం పక్క తోటలో కాపలా ఉండే బాణావతు నాగరాజు పొక్లెయిన్‌ను తగులబెట్టారనే విషయాన్ని ఫోన్ చేసి చెప్పగా, తిరుపతిరావు పొలం వద్దకు వెళ్లి చూసి వెంటనే ఉదయం 6.30గంటల సమయంలో అచ్చికాసులకు ఫోన్ చేసి చెప్పాడు. హుటాహుటిన కాసులు, గ్రామస్తులు కలిసి వెళ్లి చూడగా కాలిపోయిఉంది. రూ.40 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని, విచారణ జరిపి ఈ సంఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. పొక్లెయిన్‌ను దగ్ధం చేసిన దుండగులను త్వరగా పట్టుకోవాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పోలీసు అధికారులకు సూచించారు. సంఘటన జరిగిన ప్రదేశానికి వెళ్లి పొక్లెయిన్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అచ్చి కాసులకు ధైర్యం చెప్పడంతో పాటు దర్యాప్తును వేగవంతం చేసి దుండగులను అరెస్టు చేయాలని రూరల్ ఎస్సైకి సూచించారు.

## హాకీ ఆంధ్ర కమిటీ ఎన్నిక


పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కలిదిండి ఆనందరాజును అభినందిస్తున్న సభ్యులు


భీమవరం (ప్రకాశంచౌక్): హాకీ ఆంధ్రప్రదేశ్ సంఘం ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా జనరల్ బాడీ సమావేశం ఆదివారం భీమవరంలోని ఒక ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో హాకీ ఆంధ్రప్రదేశ్ సంఘం పశ్చిమ గోదావరి జిల్లా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికకు హాకీ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ వి.రవిరాజు, ఎన్నికల అధికారి ఎన్.వినోద్ కుమార్‌లు హాజరయ్యారు. ఈ కమిటీ ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా హాకీ ఆంధ్ర అధ్యక్షుడిగా పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన కలిదిండి ఆనందరాజును ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వి.సత్య భరత్‌ను, కోశాధికారిగా పి.మదన్, ఉపాధ్యక్షుడిగా సరిపిడకల రామారావు, ఆర్. బాల మస్తానయ్య, ఐ.గంగారాం, జాయింట్ సెక్రటరీగా పి.నాగబాబు, డి.కేశ దుర్గాప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా డీఆర్ఎస్ జే.షకీర్ బాబు, కె.బెంజాక్, పి.రిషిక లక్ష్మి ఎన్నికయ్యారు. నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. హాకీ ఆంధ్ర పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉందని కలిదిండి ఆనందరాజు అన్నారు. ఐక్యంగా ముందుకు సాగుదాం అని అన్నారు. జిల్లాకు హాకీ కోసం ప్రత్యేకంగా గ్రౌండ్‌ను ఏర్పాటు చేసుకోవాల్సిందని, దీనికోసం శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ను కలిసి సమస్య వివరిస్తామన్నారు. హాకీ ఆంధ్ర ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయి టోర్నమెంట్లను ఇక్కడే నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు.

### డ్రోన్ స్ప్రేయింగ్ లాభదాయకం


స్థానిక మాదివాడ ఆయకట్టులో డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేయిస్తున్న రైతు మోటుపల్లి రాజు

ఆకివీడు: తక్కువ ఖర్చుతో డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీతో రైతుల సమయం, డబ్బు ఆదా అవుతోంది. ఆకివీడు వ్యవసాయ సహాయ సంచాలకుల పరిధిలోని ఉండి మండలంలో రైతులు అధికంగా డ్రోన్ వినియోగిస్తున్నారు. ఆకివీడు, కాళ్ల మండలంలోని వరి రైతులు డ్రోన్ ద్వారా ఇప్పుడిప్పుడే మందు పిచికారీ చేయిస్తున్నారు. డ్రోన్ వినియోగాన్ని మరింతగా పెంచి, దాని వల్ల రైతులకు జరుగుతున్న మేలును ఆర్బీకేల ద్వారా తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు సుమారు రూ.400 వ్యయంతో డ్రోన్‌తో పిచికారీ చేయిస్తున్నారు. ఆయకట్టు రైతులు ఒకేసారి మందు పిచికారీ చేయడం వల్ల కూడా ఉపయోగం ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. డ్రోన్ ద్వారా మందు పిచికారీపై ఏడీఏ కెవీఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు, పంటకు మేలు జరుగుతుందని చెప్పారు. ఒకేసారి ఆయకట్టు రైతులు పురుగు మందును డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వల్ల ప్రతిఫలం ఉంటుందన్నారు. కూలి ఛార్జీలు తగ్గడమే కాకుండా మందు ప్రభావం అన్ని చేలకూ ఒకేసారి తగిలి చీడపీడలు దరి చేరవన్నారు. ప్రస్తుత ఖరీఫ్ పంట ఆరోగ్యకరంగా ఉందని చెప్పారు. తెగుళ్ల ప్రభావం చాలా తక్కువగా ఉందన్నారు. వర్షాలు కురిస్తే తెగుళ్లు విజృంభించవచ్చని చెప్పారు. తెగుళ్ల ప్రభావం లేనందున రైతులు ఇష్టాను సారం పురుగు మందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదని ఏడీఏ వివరించారు.

## ఆక్వా రంగ పటిష్టానికి కృషి



ఆక్వా రైతుల సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: ఆక్వా రంగ పటిష్టానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు స్పష్టం చేశారు. ఈశాన్య రాష్ట్రాలకు పెద్ద ఎత్తున ఎగుమతులతోపాటు స్థానికంగా చేపల వినియోగం పెంచగలిగితే రైతుకు ధర బాగుంటుందని వాసుబాబు అన్నారు. రూప్‌చంద్ కేజీ రూ.80 తగ్గకుండా రైతులు కట్టడిగా ఉండేందుకు ఏర్పాటు చేసిన జిల్లా ఆక్వా రైతులు సదస్సులో వాసుబాబు ముఖ్య అతిథిగా మాట్లాడారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం విద్యుత్ సబ్సిడీ ఇచ్చారని, ఆక్వా జోనులో పది ఎకరాలకు సబ్సిడీ వర్తించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు.అవుట్‌లెట్ కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని దానిని కూడా రైతులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ధర తగ్గకుండా రైతులు కలిసికట్టుగా ఉంటే ధర నిలకడగా ఉంటుందని అప్పుడు రైతులు నష్టపోరని వాసుబాబు అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న విషయాలపై సంబంధిత మంత్రి, కమిషనర్‌తో మాట్లాడి న్యాయం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. రూ.1800 కోట్ల సబ్సిడీ ఆక్వా రైతులకు లబించిందన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కన్వీనర్ పాత్తూరి శ్రీనివాసరాజు మాట్లాడుతూ రైతులు కలిసికట్టుగా ఉంటే రూప్‌చంద్ రూ.80కి తగ్గకుండా చేయవచ్చని అన్నారు. గణపవరం ఎంపీపీ దండు రాము మాట్లాడుతూ ట్రేడర్లు, ఏజెంట్లు రైతులకు కలిసిరావాలని కోరారు. ధర తగ్గుతున్నపుడు రైతులు సరుకుని 20 రోజులు ఆపగలిగితే ధర పెరుగుతుందన్నారు. జిల్లా రైతు సలహా సంఘం చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ధాన్యానికి గిట్టుబాటు ధర ఉన్నట్లే చేపలకు ఉండేలా చేయాలని అన్నారు.

**మరో సదస్సు ఏర్పాటుకు నిర్ణయం**

మూడు జిల్లాల ఆక్వా రైతులను ఏకం చేసి మరో సదస్సు ఏర్పాటు చేయాలని జిల్లా ఆక్వా రైతుల సదస్సులో నిర్ణయించుకున్నారు. ఆక్వా రైతుల సంఘం కన్వీనర్ పాత్తూరి శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిపిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కృష్ణా, తూర్పుగోదావరి, కోనసీమ రైతులను ఏకం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

## కోడిపందేలపై దాడి


చక్రాయిగూడెంలో కోడిపందేలరాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెదవేగి: కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు 27 మందిని అదుపులోకి తీసుకున్నారు. పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. చక్రాయగూడెం గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ధనరాజు, ఎస్ఈబీ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్ కుమార్, ఏలూరు ఎస్ఈబీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస రెడ్డి, ఎస్ఐ సుబ్బారెడ్డి దాడులు చేసి 27 మందని అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి రూ.90,000 నగదు, 26 కోడిపుంజులు, 38 కార్లు, 70 మోటార్ సైకిళ్లు, 34 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

## తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

పాడి - పంట


పెనుగొండలో వరిచేలను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం, మార్టేరు వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు

పెనుగొండ: వరిపై ఆశించిన తెగుళ్లకు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం, మార్టేరు వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. శుక్రవారం పెనుగొండ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ మల్లి ఖార్జునావు, డాక్టర్ ఏ రాజేష్, మార్టేరు వరి పరిశోధన స్థానం కీటక శాస్త్ర విభాగం శాస్త్రవేత్త డాక్టర ఏడీవీఎస్ఎల్ ఆనందకుమార్‌లు పెనుగొండలో వరిచేలను ఏఓలు జ్యోషిలా, రాజేష్, స్పందనల ఆధ్వర్యంలో పరిశీలించారు. వరిచేలు పొట్ట దశ నుంచి ఈనిక దశలో ఉన్నాయని, బాక్టీరియా ఆకు ఎండు తెగులు, ఆకుముడత, ఆకునల్లి, సుడి దోమ ఆశించినట్లు గమనించామన్నారు. ఆలస్యంగా నాటిన వరి చేలల్లో ఆకుముడత, ఎంటీయూ 1318 రకంలో కొంత మేర ఆకు ఎండు తెగులు గుర్తించామని.. వాటి నివారణకు సస్యరక్షణ చేపట్టాలన్నారు.

**ఆకుముడత నివారణ**

ఎసిఫెట్ 1.5 గ్రాములు, లేదా క్లోరాంట్రనిల్లీ ప్రోల్ 0.3 మి.లీ లేదా కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 2.0 గ్రా. లీటరు నీటికి కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణం పిచికారి చేయాలి. ఆకుముడత నివారణకు వరి పైరులో సిఫార్సు చేయని పురుగు మందులైన బైఫెన్త్రిన్ లాంటి దోమ ఉధృతిని పెంచే పురుగు మందులు వాడరాదు.

**ఆకు ఎండుతెగులు**

బీఎల్‌బీ నివారణకు ప్లాంటమైసిన్ 1.0 గ్రా, కోసైడ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణం పిచికారీ చేయాలి. తెగుళ్ల ఉధృతి అధికంగా ఉందని గుర్తించినపుడు 15 రోజులు వ్యవధిలో రెండో సారి పిచికారి చేయాలి. బీఎల్‌బీ సోకిన పొలాల్లో నత్రజని ఎరువులు వాడకూడదు. పొటాష్ ఎరువులు ఎకరానికి 20 కేజీలు చొప్పున వేసుకోవాలన్నారు. పొలంలో నీటిని తీసివేసి 4 నుంచి 5 రోజులు ఆరబెట్టాలి.

**సుడి దోమ నివారణ**

ప్రస్తుత వాతావరణంలో తేమ శాతం, ఉష్ణోగ్రత పెరడం వలన సుడి దోమ పెరగడానికి అవకాశం ఉంది. దుబ్బుకు 20, 25 దోమలు ఉన్నట్లయితే తక్షణం సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పొలాన్ని అడపాదడపా ఆరగట్టాలి. నివారణకు డైమెత్రోజైన్ 0.6 గ్రాములు లీటరు నీటికి లేదా, డైనోటిఫ్యూరాన్ 0.4 గ్రాములు లీటరు నీటికి, లేదా ట్రిఫ్లూమిజోపైరమ్ .48 గ్రాములు లీటరు నీటికి కలిపి ఎకరానికి 200 లీటర్ల మందుద్రావణం పిచికారి చేయాలన్నారు. కాండం తొలిచే పురుగు, ఆకుముడత నివారణకు సింతటిక్ పైరిత్రాయిడ్ మందులు వాడితే దోమ ఉధృతి పెరుగుతుందని వాడకూడదని చెప్పారు.

**కాండం దొలిచే పురుగు**

చిరుపొట్టదశలో క్లొరానట్రనిల్లీప్రోల్ గుళికలు ఎకరానికి 4 కేజీల వంతున 20 కేజీల ఇసుకలో కలిపి వేయాలి. పొలంలో గుళికలు వేసేటపుడు నీటిని తగ్గించి వేయాలి. నీటిని అదుపు చేయలేని పొలాల్లో పైపాటుగా క్లొనట్రనిల్లీప్రోల్ 0.3 మి.లీ లేదా కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 2.0 గ్రాములు లేదా క్లొరిపైరిఫాస్ 2.5 మిలీ గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**మానిపండు తెగులు**

మానిపండు నివారణకు ఈనిక దశలో ప్రొపికొనజోల్ 1 మి.లీ, లేదా కార్బండేజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

### నిందితులకు రిమాండ్

ఉండి: ఈ నెల 14న ఉండి గోరింతోట ప్రాంతంలో లారీని అడ్డగించి డ్రైవర్ వద్ద ఉన్న నగదును దొంగిలించిన కేసులో కడలి విజయ్‌కుమార్, జుత్తిగ చక్రవర్తి, ములపర్తి యేసు, కొత్తలంక దుష్యంత్, గజ్జల సాయిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆకివీడు రూరల్ సీఐ కేవీవీఎస్ సత్యనారాయణ తెలిపారు. భీమవరం రెండో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారని భీమవరం సబ్‌జైలుకు తరలించినట్లు తెలిపారు. ఉండి మండలం మహదేవపట్నంలోని బొక్కావారి పాలెంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై పోలీసులు దాడి చేశారు. దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.వెయ్యి నగదు, కోడి, కత్తి, 11 మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు.

## క్లుప్తంగా

### విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద వామపక్షాల ధర్నా

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం, దండగర్ర సబ్‌స్టేషన్ల వద్ద సీపీఎం, సీపీఐ నాయకులు ఆదివారం ధర్నా నిర్వహించారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకొస్తున్న విద్యుత్ సంస్కరణలో రాష్ట్రంలో అమలు చేయవద్దని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు కండెల్లి సోమరాజు, సీపీఐ మండల కార్యదర్శి ఉల్లింకల జయకృష్ణ, సీపీఎం నాయకులు పీలా గాదినాయుడు, కూనవరపు నాగభూషణం, ఆమర్తి చంద్రరావు, సీపీఐ నాయకులు ఉల్లింకల నాగేంద్రప్రసాద్, కర్రి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### అరుణాచల గిరి ప్రదక్షిణపై ఆర్టీసీ ప్రచారం


అరుణాచల గిరి ప్రదక్షిణకు బస్సు ఏర్పాటుపై మహిళలకు వివరిస్తున్న ఆర్టీసీ అధికారులు

పెంటపాడు: తాడేపల్లిగూడెం నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణకు ఈనెల 26న ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు గూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ ఏలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఈ బస్సు ఏర్పాటు పై ప్రచారం చేసేందుకు గాను ప్రత్తిపాడు, కె. పెంటపాడు, పెంటపాడు తదితర గ్రామాలలో ఆర్టీసీ అధికారులు ఆదివారం ప్రచారం చేసి భక్తులను, ఆలయాలను, గృహసముదాయాలలోని మహిళలను కలిసి కరపత్రికతో ప్రచారం చేశారు. నాలుగు రోజుల యాత్రలో భాగంగా ఈనెల 26 నుంచి గూడెం నుంచి బయలుదేరే బస్సులు కాణిపాకం, కాంచిపురం గోల్డెన్ టెంపుల్ తదితర యాత్రలు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. డీవీ కుమార్, ఎం. ఆదినారాయణ పాల్గొన్నారు.

### గ్రంథాలయాల్లో దసరా శిక్షణ శిబిరాలు


గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరానికి విచ్చేసిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు కోరారు. దసరా సెలవుల నేపథ్యంలో ఈ నెల 24 వరకు ప్రభుత్వ సెలవు రోజులు తప్ప, ప్రతి రోజు 8 గంటల నుంచి 12 గంటల వరకు తాడేపల్లిగూడెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థుల కోసం శిక్షణ శిబిరంలో కథలు, గ్రంథాలయంలోని పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, తదితర ఇతర అంశాలు అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు సమక్షంలో ఈ తరగతులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అనుమతితో విద్యార్థులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం హాజరైన విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ అందించారు.

### నేడు రావిపాడులో దుర్గమ్మ ఆలయ ప్రతిష్ట


రావిపాడులో ఆలయ ప్రతిష్టాపన పూజలు చేస్తున్న భక్తులు

పెంటపాడు: రావిపాడు గ్రామస్తులు, కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు నిర్మించిన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ, విగ్రహప్రతిష్ట మహోత్సవం ఈనెల 16న నిర్వహించనున్నట్లు స్థానిక సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారి నూతన ఆలయంలో వేసిన చలువ పందిరిలో ప్రత్యేక పూజలు జరిగాయి రూ. 10 లక్షల ఖర్చుతో శిథిలమైన ఆలయాన్ని గ్రామస్తులు నిర్మించుకొన్నారు. కాగా 16న ఉదయం జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ హాజరవుతారని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు ఈ సందర్భంగా ఆదివారం ఉదయం నుండి ప్రత్యేక పూజలైన దీక్షారాధన, ధాన్యాదివాసం, జలాదివాసం తదితర పూజలు నిర్వహించారు. 16న ప్రతిష్ట, పూర్ణాహుతి, 20న భారీ అన్నసమారాధన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు రమణ తెలిపారు.

# మహో కనకదుర్గా.. విజయ కనకదుర్గా

- ప్రారంభమైన దసరా మహోత్సవాలు
- దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భవానీ మాలధారణ చేసిన భక్తులు


తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ వాసవిలో బాలా త్రిపుర సుందరీ దేవిగా ఆకట్టుకున్న అలంకరణ


తాడేపల్లిగూడెం (టీఓసీ): శంకరమఠంలోని విశేష అలంకరణలో సర్వమంగళమ్మ


తాడేపల్లిగూడెం (టీఓసీ): వీకర్స్‌కాలనీలోని విశేష అలంకరణలో గాయత్రీదేవి


పెంటపాడు: ప్రత్తిపాడు వై.జంక్షన్‌లో కొలువైన దుర్గాదేవి


పెంటపాడు: పూజలందుకుంటున్న ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులోని కనకదుర్గమ్మ


తణుకు అర్బన్: తణుకులో శ్రీ బాలా త్రిపుర సుందరి అవతారంలో శ్రీ కామాక్షి దేవి అమ్మవారు


అత్తిలి: ఆరవల్లిలో శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో శ్రీ కనకదుర్గా భవాని అమ్మవారు


తాడేపల్లిగూడెం అర్బన్: గాయత్రీదేవి ఆలయంలో లక్ష కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆదివారం వైభవంగా దసరా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీ వాసవి పంచాయతన క్షేత్రంలో మొదటిరోజు వాసవి అమ్మవారిని బాలాత్రిపుర సుందరీ దేవిగా విశేష అలంకరణ గావించారు. ఉత్సవ మూర్తిని ఆదిలక్ష్మిగా అలంకరణ చేశారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులు శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే ఏలూరు రోడ్డులోని శంకరమఠంలో వేంచేసియున్న సర్వమంగళమ్మ వారిని రజత కవచాలంకృత సర్వమంగళ అమ్మవారిగా విశేష అలంకరణ చేశారు. విస్థానిక వీకర్స్ కాలనీలోని గాయత్రి అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించారు. ఆలయం వద్ద విశేష లక్ష కుంకుమార్చనలు, చండీ హోమాలు చేశారు. శ్రీదేవి మహంకాళమ్మతల్లి ఆలయంలో నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షులు యెగ్గిన నాగబాబు ఆధ్వర్యంలో అమ్మవారిని రజిత కవచాలంకృత దుర్గాదేవిగా అలంకరించారు. అఖిల భారత వైష్ణవ సంఘం అధ్యక్షులు కొడవటిగంటి నరసింహాచార్యులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. కడకట్లలోని రెల్లి కాలనీలో బాల కనక దుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని స్వర్ణ కవచ దుర్గాదేవిగా విశేష అలంకరించారు. హౌసింగ్‌బోర్డు కాలనీ ఎంట్రన్స్‌లోని విఘ్నేశ్వర బాల కనకదుర్గ దేవి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా విశేష అలంకరణ చేశారు. శివాలయం వీధిలో కనకదుర్గమ్మ అమ్మవారిని ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విశేష అలంకరించారు. 17వ వార్డు విశ్వ దుర్గేశ్వరీ ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. బ్రహ్మానందరెడ్డి మార్కెట్, వార్ఫ్ రోడ్డులోని అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అలాగే స్థానిక శ్రీబలుసులమ్మ తల్లికి దసరా మహోత్సవాల సందర్భంగా ఆదివారం పట్టణానికి చెందిన డాక్టర్ మోరా రమాదేవి నాలుగున్నర గ్రాముల బంగారంతో చేయించిన ముక్కుపుడకను అందజేశారు. ఈ ముక్కుపుడకను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతులమీదుగా ఈ ముక్కు పుడకను ఆలయ కమిటీ చైర్మన్ అంజిబాబు అందుకున్నారు.

**పెంటపాడులో..**

పెంటపాడు: మండలంలో దసరాశరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దర్శిపర్రు పార్వతి బ్రహ్మలింగేశ్వరస్వామివారి ఆలయంలో కనకదుర్గమ్మ అమ్మవారిని ఉత్సవ సామగ్రితో ఊరేగించారు. ఆలయకమిటీ సభ్యులతో కలశస్థాపన చేశారు. పెంటపాడు పోలీస్‌స్టేషన్ వద్ద కాశీ అన్నపూర్ణ ఆలయం వద్ద గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. వార్డు మెంబర్ కాసారపు శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే ముసినాని వారి వీధిలో ప్రతిష్టించిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద వైఎస్సార్ సీఈప నాయకులు కొవ్వూరి ప్రసాద్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయంలో దసరా వేడుకులను వైభవంగా ప్రారంభించారు. మౌంజీపాడు కనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు కె. బుచ్చిబాబు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. ప్రత్తిపాడు వై.జంక్షన్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంబమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ సైపురెడ్డి రాంబాబు, ఈఓ ఆధ్వర్యంలోఅమ్మవారిని స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా అలంకరించారు. కె. పెంటపాడు బైరాగిమఠంలో దుర్గమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించారు. అర్చకులు త్రిలోచనదాస్, పూర్ణచంద్రత్రిపాఠి, రామశర్మలు ప్రత్యేక పూజలు చేశారు. రావిపాడు దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. బెండల్లంక ప్రాంతంలో ముళ్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మీనవిల్లూరు దేవీ సెంటర్‌లోని ఆలయం వద్ద, కొండేపాడులోని కనకదుర్గాదేవి ఆలయం వద్ద దసరా సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

**దానేశ్వరి అమ్మవారి ఆలయంలో..**

తణుకు టౌన్: తణుకు రూరల్ దువ్వ గ్రామంలో వేంచేసియున్న శ్రీ దానేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలను కలశ స్థాపన చేసి ప్రారంభించారు. సర్పంచ్ అడ్డా బాబు, ఆలయ కమిటీ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ, ఈవో ముత్యాల సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**శ్రీ బాలా త్రిపుర సుందరిగా శ్రీ కామాక్షి దేవి**

తణుకు అర్బన్: శ్రీదేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయంలో వేంచేసియున్న శ్రీ కామాక్షి దేవి అమ్మవారు ఆదివారం శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. దేవీ నవరాత్రులు మొదటి రోజు కావడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యాన తొలుత కలశ స్థాపన చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పాడుగు రామాచారి (రాము) ఆధ్వర్యాన జరిగిన పూజాధికాల్లో ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మోజు రామకృష్ణ, వైస్ చైర్మన్ ధవళేశ్వర సుబ్బారావు, కమిటీ సభ్యులు, స్వర్ణకార సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

**శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం**

అత్తిలి: శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అత్తిలిలో స్వయంభూ శ్రీ విజయ చాముండేశ్వరీ దేవి అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. కందుల ధర్మశాస్త్ర, ఈశ్వరీ కుసుమ కుమారి దంపతులు చండీహోమం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆరవల్లిలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గా భవాని అమ్మవారి ఆలయంలో 28వ దేవి నవరాత్రి మహోత్సవాలను ప్రారంభించారు. తెల్లవారు జామున వెలగల అమ్మిరెడ్డి, అంబికాదేవి దంపతులు గణపతి పూజ, మండపారాధన, శ్రీదేవి కలశ స్థాపన, అఖండ దీపారాధన పూజాధికాలు నిర్వహించారు. అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. నల్లిమిల్లి అయ్యప్ప నాగ శ్రీధర్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతులు అమ్మవారికి పుష్పాలంకరణ చేసి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

**వీకర్స్ కాలనీలో...**

తాడేపల్లిగూడెం అర్బన్ దసరా నవరాత్ర ఉత్సవాలను వీకర్స్‌కాలనీ గాయత్రిదేవి ఆలయం వద్ద ఆదివారం ఘనంగా ప్రారంభించారు. మొదటి రోజు అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరి అమ్మవారిగా దర్శనమిచ్చారు. కూనంశెట్టి వీరవెంకట సత్యనారాయణ జగన్మోహననాయుడు దంపతులు శరన్నవరాత్ర ఉత్సవ విగ్రహాన్ని సమర్పించారు. ఆలయ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారి పీఠం వద్ద అమ్మవారిని ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పేరూరి కాశయ్య, కూనంశెట్టి వీరవెంకట సత్యనారాయణ జగన్మోహననాయుడు దంపతులు ప్రత్యేక పూజలతో పాటు కమలాలయ హోమం, చండీయాగం పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలు అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## ముత్యాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుబాబు


తాడేపల్లిగూడెం రూరల్: ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు ముత్యాలమ్మ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారిని ఆదివారం శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా రజిత కవచంతో శ్రీముత్యాలమ్మ వారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి సహస్ర నామ కుంకుమ పూజలు, చండీ పారాయణ నిర్వహించారు. సాయంత్రం చండీ హోమం, పుష్పార్చన, సహస్ర కుంకుమ పూజ, విశేష హారతులనిచ్చారు. అమ్మవారిని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాంప్రసాద్ పాల్గొన్నారు.

## యల్లారమ్మను దర్శించుకున్న మంత్రి కారుమూరి


తణుకు టౌన్: మండపాక యల్లారమ్మ ఆలయంలో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తణుకు టౌన్: దసరా వేడుకల సందర్భంగా తణుకు మండలంలోని పలు గ్రామాల్లో శ్రీదేవీ శరన్నవరాత్రి, భవానీ దీక్షా పీఠాలను ఆదివారం ప్రారంభించారు. తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని శ్రీ యల్లారమ్మ ఆలయంలో జరిగిన శరన్నవరాత్రి వేడుకల్లో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మంత్రి కారుమూరికి ఆలయం వద్ద పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యాన మంత్రిని సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల మణికంఠ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల సన్యాసిరావు, ఏఎంసీ డైరెక్టర్ వై.విజయమూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్ పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయం

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి, వైఎస్సార్ సీపీ శ్రేణులు

తణుకు అర్బన్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం తణుకు రాష్ట్రపతి రోడ్డు బాలుర ఉన్నత పాఠశాల ప్రాంతంలో ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ పేపరు బాయ్ నుంచి రాష్ట్రపతి పదవి స్థాయికి చేరారంటే ఆయన ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొని విజయం సాధించారో తెలుసుకోవాలని అన్నారు. సైన్స్ మాంత్రికుడిగా పేరు గాంచిన కలాం ఆశయాలను అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, వైఎస్సార్ సీపీ తేతలి నాయకులు కోట నాగేశ్వరరావు, కోట స్వామిజీ, ములగాల శ్రీనివాస్, కుడుపూడి చంద్రరావు, కొమ్మోజు రామకృష్ణ, గంజి సతీష్, షేక్ సలీం, సప్పా బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చేతుల పరిశుభ్రతపై అవగాహన


చేతుల పరిశుభ్రత దినోత్సవంలో పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు

తాడేపల్లిగూడెం రూరల్: చేతులను పరిశుభ్రత అలవాటుగా చేసుకోవాలని, తద్వారా 90 శాతం వ్యాధులు దరి చేరవని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం మండలంలోని పడాల గ్రామంలో చేతులు పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మల్లికార్జునరావు మాట్లాడుతూ ఏదైనా తినే సమయంలో చేతులు శుభ్రం చేసుకోకపోవడం వల్ల చేతి ద్వారా క్రిములు శరీరంలోకి ప్రవేశించి, వ్యాధులకు గురి చేస్తాయన్నారు. ఆహారం తీసుకునే ముందు సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. ఐక్యరాజ్య సమితి, యునిసెఫ్ సంయుక్తంగా ఈ విషయంపై విస్తృత ప్రచారం చేయాలని సూచించాయన్నారు. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేతుల పరిశుభ్రత కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి కే.శ్రీనివాస్, డ్వాక్రా సీసీ నేతల వెంకటలక్ష్మి, ఏఎస్ఎం ఇంటి వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ బుంగా జ్యోతి, కామిశెట్టి కృష్ణవినోద్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా బీవీ రాజు జయంతి

సాక్షి, భీమవరం: డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీవీ రాజు 103వ జయంతి సందర్భంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎడ్యుకేషనల్ సొసైటీలోని బీవీరాజు విగ్రహానికి కళాశాలల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సెంట్ మేరీస్ లెప్రసీ సెంటర్‌లో రోగులకు రూ.60 వేలు విలువైన మందులు, బియ్యం, పండ్లు ఇతర సామగ్రి పంపిణీ చేశారు. 112 మంది లెప్రసీ రోగులకు పెన్షన్లు అందజేశారు. అదే విధంగా బీవీరాజు మున్సిపల్ పార్కు వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

### ఆర్టీసీ ఈయూ సమావేశం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం అనంతరం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలలో ప్రధానంగా 2020 నుంచి మూడేళ్ల లీవ్ ఎన్‌క్యాష్ మెంటు, 2020 జనవరి తర్వాత చనిపోయిన, రిటైర్, వీఆర్ఎస్ తీసుకున్న, మెడికల్‌గా అన్‌ఫిట్ వారి సెటిల్‌మెంట్లు సెప్టెంబర్‌లోగా చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు.

## సమస్యల పరిష్కారానికి గడప గడపకూ


సురంపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు చేకూరిన లబ్ధిని వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ఇరగవరం: ప్రజా సమస్యల పరిష్కారానికే ఇంటింటికీ వెళ్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం మండలంలోని సురంపూడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయో లేదో తెలుసుకుని అర్హులైన వారికి అందిస్తామని చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఇప్పటి వరకు వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్‌ను అందజేశారు. ఇలాంటి సంక్షేమ పథకాలు మరిన్ని కావాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు.

**రూ.14 కోట్లతో గ్రామాభివృద్ధి**

ఒక్క సురంపూడి గ్రామంలోనే రూ.14 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు మంత్రి కారుమూరి తెలిపారు. మొత్తం 625 గృహాలు ఉండగా, 423 గృహాలను సందర్శించారు. అనంతరం గ్రామంలోని కమ్యూనిటీ హాళ్లు, సచివాలయం దగ్గర ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు లేవని మంత్రికి ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ అలివేలు మంగతాయారు, వెలగల సాయిబాబా రెడ్డి, సర్పంచ్ కఠారి చంద్రమణి, ఎంపీటీసీ సభ్యురాలు బొల్లా పద్మావతి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దుర్గాప్రసాద్, కఠారి వెంకట రామరాజు, బొల్లా రాము, జాలి సుబ్బారావు, పంచాయతీ వార్డు సభ్యులు, అధికారులు, పార్టీ నాయకలు పాల్గొన్నారు.

### వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య సేవలు కార్యక్రమంలో భాగంగా 8 మంది వృద్ధులకు సేవలందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యుడు సుంకవల్లి నీలు మహేంద్ర తణుకు పట్టణం, పైడిపర్రు, పాలంగి గ్రామాల్లో పర్యటించి నడవలేని వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. వైద్యులకు అసోసియేషన్ కోశాధికారి ఆర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది సహకరించారు. అలాగే అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రతి నెలా మూడో ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో భాగంగా 36 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసినట్లు తెలిపారు.

### జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు

సాక్షి, భీమవరం: జన విజ్ఞాన వేదిక జిల్లా 17వ మహాసభలు పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ సమాజ ప్రగతి కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి శాస్త్రీయ దృక్పథంతో పనిచేయాలని కోరారు.

## స్థిరాస్తి చట్టాలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న మునిస్వామి

తణుకు: స్థిరాస్తి గొనుగోలులో చట్టబద్ధత కలిగి ఉండాలని అఖిల భారత లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి అన్నారు. ఆదివారం తణుకులోని శ్రీశ్రీ విజ్ఞాన కేంద్రంలో పలువురికి ఆయన ఉచిత న్యాయ సలహాలను ఇచ్చారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు లాభాల కోసం ఆస్తులను విక్రయిస్తుంటారని, కొనుగోలుదారులు ముందుగానే దస్తావేజులను పరిశీలించుకోవాలన్నారు. స్థిరాస్తి విషయంలో విక్రయించే వారికి ఆస్తిపై ఎలాంటి హక్కు ఉన్నది అనే విషయాన్ని ముందే తెలుసుకోవాలని సూచించారు.